www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 16 మే 2024

5

అన్నమయ్య

తిరుపతి ఐఐటి ఇంటర్న్‌షిప్‌కు 'మిట్స్' విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో మూడవ సంవత్సరం విద్యార్థులకు తిరుపతి లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ (ఐఐటి)లో ఇంటర్న్‌షిప్ లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. విఎల్ఎస్ఐ అను అంశంపై వి.కుమార్, లోకేశ్వర్, కావేరి, హర్షిక మరియు దివ్యలకు 45 రోజుల పాటు ఇంటర్న్‌షిప్ లభించినట్లు పేర్కొన్నారు. వీరు విఎల్ఎస్ఐపై ఐఐటీ తిరుపతి లో పరిశోధనలు చేస్తారన్నారు. ఎంపిక అయిన ఈ విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

మహిళా చైతన్యం

కడపలో 37,406 మహిళల ఓట్లు

అన్నమయ్య జిల్లాలో 25,947 ఓట్లు

ప్రొద్దుటూరులో అత్యధికంగా 7,948 ఓట్లు

గెలుపోటములపై గణనీయ ప్రభావం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రికంలో మహిళా చైతన్యం వెల్లివిరిసింది. కడప పార్లమెంట్‌లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 37 వేలు, రాజంపేట పార్లమెంట్‌లో 26 వేల ఓట్లపైగా నమోదు కావడం గమనార్హం. 1996 ఎన్నికల అనంతరం ఎన్న డూలేని విధంగా పోటాపోటీగా సాగిన తాజా ఎన్నికల్లో ఎవరు గెలిచినా స్వల్పమెజార్టీలతో గెలిచే అవకాశాలు ఉన్నాయనే అంచనాల నేపథ్యంలో మహిళా ఓటరు కీలకపాత్ర పోషించే అవకాశం ఉందనే విశ్లేషణ వినిపిస్తోంది. కడప పార్లమెంట్‌లో 16,39,066 మంది ఓటర్లలో పురుష ఓటర్లు 8,00,857 మంది, మహిళా ఓటర్లు 8,37,993 మంది, ఇతర ఓటర్లు 216 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 37,406 మంది ఉండడం గమనార్హం. రాజంపేట పార్లమెంట్‌లో 14,26,834 లక్షల ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 7,00,380 మంది, మహిళా ఓటర్లు 7,26, 327 మంది, ఇతరులు 91 మంది ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు 25.947 వేల మంది అధికంగా ఉండడం గమనార్హం. కడప పార్లమెంట్ పరిధిలోని కడప అసెంబ్లీలో 2,83,543 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,38,300 మంది, మహిళా ఓటర్లు 1,45,152 మంది, 90 మంది ఇతరులు ఉన్నారు. సుమారు 6,852 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. బద్వేల్ అసెంబ్లీలో 2,19,290 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,09,163 మంది, మహిళా ఓటర్లు 1,10,122 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. 959 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. పులివెందుల అసెంబ్లీలో 2,29,687 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,11,727 మంది, మహిళా ఓటర్లు 1,17,941 మంది, ఇతరులు 19 మంది ఉన్నారు. 6,214 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. కమలాపురం అసెంబ్లీలో 2,04,169 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 99,851 మంది, మహిళా ఓటర్లు 1,04,284 మంది ఓటర్లు, ఇతరులు 34 మంది ఉన్నారు. 4,433 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. జమ్మలమడుగు అసెంబ్లీలో 2,42,556 ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,17,746 మంది, మహిళా ఓటర్లు 1,24,795 మంది, ఇతర ఓటర్లు 15 మంది ఉన్నారు. 7,049 మంది ఓటర్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. ప్రొద్దుటూరు అసెంబ్లీలో 2,47,966 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,19,985, మహిళా ఓటర్లు 1,27,933, ఇతర ఓటర్లు 48 మంది ఉన్నారు. 7,948 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మైదుకూరు అసెంబ్లీలో 2,11,855 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 104,085 మంది, మహిళా ఓటర్లు 1,07, 765 మంది ఉన్నారు. 3,680 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. రాజంపేట పార్లమెంట్‌లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 25,947 మంది ఎక్కువగా ఉన్నారు. రాజంపేటలో 2,41,200 ఓటర్లు ఉండగా 1,83, 442 ఓట్లు నమోదయ్యాయి. పురుష ఓటర్లు 1,17,577 మంది, మహిళా ఓటర్లు 1,23,617 మంది ఉన్నారు. 6,040 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. రైల్వేకోడూరులో 2,04,456 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,00, 663 మంది, మహిళా ఓటర్లు 1,03,794 మంది ఉన్నారు. 3,131 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. రాయచోటిలో 2,55,168 మంది ఓటర్లు ఉన్నారు. 1,26,090 మంది పురుష ఓటర్లు, 1,29,051 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 2,961 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. తంబళ్లపల్లిలో 2,24,802 మంది ఓటర్లు ఉన్నారు. 1,10,627 మంది పురుష ఓటర్లు, 1,14,163 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 3,535 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. పీలేరులో 2,34,608 మంది ఓటర్లు ఉన్నారు. 1,14,962 మంది పురుష ఓటర్లు, 1,19,624 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 5,464 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. మదనపల్లిలో 2,66,590 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,30,461 మంది, మహిలా ఓటర్లు 1,36,078 మంది ఉన్నారు. 5,617 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. కడప, రాజంపేట పార్లమెంట్ పరిధిలోని 13 అసెంబ్లీల బరిలో కడప పార్లమెంట్ బరిలో కాంగ్రెస్ తరుపున మహిళా అభ్యర్థి వైఎస్ షర్మిల, కడప అసెంబ్లీకి టిడిపి తరుపున ఆర్.మాధవి బద్వేల్ అసెంబ్లీ బరిలో కాంగ్రెస్ తరుపున విజయజ్యోతి, వైసిపి తరుపున డాక్టర్ సుధ, రైల్వేకోడూరు అసెంబ్లీ బరిలో కాంగ్రెస్ తరుపున గోశాల దేవి పోటీ చేసిన నేపథ్యంలో మహిళా ఓటర్లు మోస్తరుగా మహిళా అభ్యర్థులకు మద్దతుగా తెలిపి నట్లు తెలుస్తోంది.

కలసపాడులో బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్ ఫొటో)

గెలుపుపై.. ఎవరి ధీమా వారిదే..

- బూత్‌ల వారీగా లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు
- బిజెపి పొత్తుతో ముప్పు అంటున్న తెలుగు తమ్ముళ్లు
- గెలుపోటములపై పందేల జోరు

ప్రజాశక్తి - రాయచోటి

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సోమవారం ముగిసింది. జూన్ 4న కౌంటింగ్, అదే రోజు ఫలితాలు వెలబడునున్నాయి. బరిలో నిలిచిన అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు గెలుపు దిశగా ఎవరు అంచనాలు వారు వేసుకుం టున్నారు. అన్నమయ్య జిల్లాలో రాజంపేట పార్లమెంట్, రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 14,26,834 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 7,00,380, స్త్రీలు 7,26,327, ట్రాన్స్ జెండర్స్ 127 మంది ఓటర్లు ఉన్నారు. అయితే పురుషులు 5,43,133 స్త్రీలు 5,67,350 ట్రాన్స్ జెండర్స్ 49 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 77. 83 శాతం పోలింగ్ నమోదయింది.

పోలింగ్ బూత్‌లు వారీగా అభ్యర్థుల దృష్టి

టిడిపి, వైసిపి, ఇతర పార్టీలు పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లను లెక్కలు వేసుకుంటున్నారు. వీటి ఆధారంగా గెలుపు, ఓటమి, మెజారిటీలను లెక్కలు వేసుకుంటున్నారు. ఈసారి పోలింగ్ శాతం పెరగడంతో ఎవరికి వారు తమకు అనుకూలంగా లెక్కలు వేసుకుంటున్నారు. అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంలలో ఉంది. గెలుపుపై ఇరు పార్టీ నాయకులు ధీమాగా కనిపిస్తున్నారు. ఈ సారి భారీ మెజార్టీలు పెద్దగా ఉండవని ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీతోని గెలుస్తారని చర్చలు బలంగా వినిపిస్తున్నాయి. పొత్తులో భాగంగా రాజంపేట పార్లమెంటును బిజెపి పార్టీకి కేటాయించారు. దీంతో రాజంపేట పార్లమెంటు, కొన్ని అసెంబ్లీ స్థానాలపై టిడిపి ఆశల వదులుకోవాల్సి వస్తుందని తెలుగు తమ్ముళ్లు గుసగుసలాడుతున్నారు.

బెట్టింగులు జోరు

ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాల కోసం జిల్లాలో క్రికెట్ బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. అన్నమయ్య జిల్లాలో 1 పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించారు. బెట్టింగ్ రాయుళ్లకు పెద్ద పండగలా నిర్వహించుకుంటున్నారు. ఎన్నికల ఫలితాలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని సొమ్ము చేసుకుంటున్నారు. కోడిపందెల తరహాలో ఎన్నికల ఫలితాలు మెజారిటీ బెట్టింగులు భారీగా నిర్వహిస్తున్నారు. అధికారంలోకి వచ్చే పార్టీ ఏది, ఎన్ని సీట్లు ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు, ఏ మండలంలో ఎవరికి మెజార్టీ వస్తుంది, ఏ గ్రామంలో ఏ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుంది, పలు అంశాల పలు కోణాలలో కోట్ల రూపాయల బెట్టింగులు జోరుగా నిర్వహిస్తున్నారు.

అవగాహనతో క్షయ అంతం

నేటి నుంచి బిసిజి టీకా పంపిణీ
డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

ప్రజాశక్తి-రాయచోటి

అవగాహనతోనే క్షయ వ్యాధి అంత మవుతుందని, ఈ నెల 16 నుంచి జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు బిసిజి ఉచిత టీకా పంపిణీ కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖా ధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఈ ఉచిత టీకా పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ వైద్య ఆరోగ్య శాఖకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో 2025 నాటికి టిబి నివారణే లక్ష్యంగా ఈ నెల 16 నుంచి జిల్లాలోని అన్ని సచివాలయాలలో ప్రతి గురువారం 3 నెలలు పాటు ప్రత్యేక శిక్షణ పొందిన ఆరోగ్య సిబ్బంది ద్వారా ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. 18 ఏళ్ల పైబడి ఐదేళ్లలోపు క్షయ కొరకు మందులు మింగి టిబి వ్యాధి నయం అయిన వారికి, క్షయవ్యా ధిగ్రస్థుల కుటుంబసభ్యులకు, మధుమేహ వ్యాధిగ్రస్థులకు, ధూమపానం సేవించే వారికి, 60 ఏళ్లు పైబడి వయస్సు కలవారికి ఈ బిసిజి ఉచిత టీకా పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఆరోగ్య సిబ్బంది, సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులను, అంగన్వాడీ సిబ్బందిని, టిబి ఛాంపియన్లను సమన్వయ పరుచుకొని ఈ టీకా ప్రాముఖ్యత ప్రజలకు తెలియచేసి వాక్సిన్ కార్య క్రమంను విజయవంతం చేయుటకు కృషి చేయాల న్నారు. ఈ టీకా ప్రాముఖ్యత దృష్ట్యా మీడియా సహ కారం ఎంతో అవసరమని మీడియా వారందరూ కూడా కార్యక్రమ విజయవంతానికి సహకారిం చాలని పాత్రికేయులను కోరారు. రాష్ట్ర స్థాయి అధికారి డాక్టర్ దేవసాగర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఈ బిసిజి టీకా కార్యక్రమం ఎంపిక చేసిన జిల్లాలలో ప్రారంభిస్తామన్నారు. అన్నమయ్య జిల్లా బిసిజి టీకా పంపిణీ కార్యక్ర మానికి ఎంపిక అయినందున మన జిల్లాలో కూడా రేపటి నుంచి మూడు నెలల పాటు ప్రతి గురు వారం బిసిజి టీకా పంపిణీ చేయడానికి జిల్లా ఉన్నతాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కంద్రాల వైద్యా ధికారుల సహాయ సహకారాలతో అన్ని సచివాల యంలలో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ వాక్సిన్ కార్యక్రమం ఎక్కడ ఆయితే జరుగుతుందో సంబంధిత ఆరోగ్య సిబ్బంది ముందుగానే మీమీ ఏరియా ప్రజలకు వాక్సిన్ యొక్క ప్రాముఖ్యతను తెలియచేసి వారి యొక్క సమ్మతితో ఈ వాక్సిన్ కార్యక్రమం జయప్రదం చేయాలని సూచించారు. గర్భిణులు, పాలు ఇచ్చు తల్లులకు, ఎచ్ఐవి వ్యాధి గ్రస్థులకు, కేన్సర్ పేషంట్లకు, మూడు నెలలలో రక్తమార్పిడి చేసుకున్న వారికి ఈ టీకా ఇవ్వడం జరగదని ప్రజలు అందరు అపోహలు వీడి స్వచ్చం దంగా ముందుకు వచ్చి టిబి (క్షయ) రహిత సమాజం కోసం పాటుపడాలని తెలియచేశారు. కార్యక్రమాన్ని జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి, జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి కార్యక్రమంలో పాల్గొని నిర్వహిస్తూ, పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

పీలేరు : క్షయ వ్యాధి నిర్మూలనా కార్య క్రమంలో భాగంగా గురువారం నుంచి పెద్దలకు బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడి యాతో మాట్లాడుతూ మే నెల 16 నుంచి తలుపుల పిహెచ్‌సి పరిధిలోని 8 సచివాలయాల్లో గుర్తించి, సమ్మతి పొందిన వయోజనులకు ప్రతి గురువారం బిసిజి టీకాలను సూక్ష్మ ప్రాణాళికను అనుసరించి ఇస్తామన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగు ణంగా ప్రతి వెయ్యి మంది జనాభాలో 20 శాతం మంది వయోజనులు ఈ బిసిజి వ్యాక్సిన్‌కు అర్హులని చెప్పారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి, టిడి వ్యాధి రాకుండా ఈ వాక్సిన్ కాపాడుతుందని తెలిపారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్వాన్ కట్టా నరసింహులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

జిల్లా ప్రతిష్టను పెంచిన కట్టా నరసింహులు

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు సాహిత్యం, జిల్లా చరిత్రలపై ఎంతో మమకారం ఉన్న విద్వాన్ కట్టా నరసింహులు కైఫియత్తుల పరిష్కారం ద్వారా మరుగున పడిన గొప్ప చరిత్రను వెలికితీసి జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేశారని యోగి వేమన పాలక మండలి సభ్యులు, వై.ఎస్.ఆర్. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. బ్రౌన్ గ్రంథాలయ తొలి బాధ్యులు, కడప కైఫియత్తుల పరిష్కర్త విద్వాన్ కట్టా నరసింహులు 3వ వర్ధంతిని పురస్కరించుకొని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు ఆధ్వర్యంలో బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహించింది. తొలుత విద్వాన్ కట్టా చిత్రపటానికి పూలమాల అలం కరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లా డుతూ సాహిత్యం కంటే కట్టా చరిత్ర పరిశోధనపై కృషిచేశారని, కైఫియత్తుల పరిష్కారంతో ఆయనకు తెలుగునాట విశేషమైన పేరు ప్రతిష్టలు లభించా యన్నారు. పోతన సాహిత్య పీఠం ఏర్పాటుతో పాటు ఒంటిమిట్టకు ప్రభుత్వ లాంఛనాలు దక్కేందుకు ఆయన చరిత్ర పరిశోధన ఎంతో ఉపయోగప డిందన్నారు. బ్రౌన్ గ్రంథాలయంతో పాటు ఆయనకు బ్రహ్మంగారిమఠం, ఒంటిమిట్టలతో విడదీయలేని అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ విద్వాన్ కట్టా నరసింహులుకు జిల్లా రుణపడి ఉందని, ఆయనకెంతో ఇష్టమైన బ్రౌన్ గ్రంథాలయ ఆవరణలో బ్రౌన్ శాస్త్రి సరసన ఆయన శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సమంజసంగా ఉంటుందన్నారు. రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, జానమద్ది నాగరాజు మాట్లాడుతూ కడప కైఫియత్తుల పరిష్కారం అనితర సాధ్యమని, ప్రతిభగల ప్రతివారిని విద్వాన్ కట్టా ఎంతో ఆత్మీయంగా ప్రోత్సహించేవారని ఆయనలేని లోటు తీర్చలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, చిత్రకారుడు వెంకటేష్, మధు, డేవిడ్, గొబ్బూరి కోటేశ్వరరావు, జ్యోతి జార్జి పాల్గొన్నారు.

అశ్వవాహనంపై వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : జగద్గురు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం ఉదయం శ్రీ గోవింద మాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి అశ్వవాహనంపై ఊరేగారు. ఆరు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు పిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్యాచారి ఆరాధనకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా ఎస్ఐ విద్యాసాగర్ గట్టి బందోబస్తు నిర్వహించారు.

అశ్వవాహనంపై ఊరేగుతున్న వీరబ్రహ్మం

ప్రజాస్వామ్యంలో విలువలుండాలి

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి రాయచోటి

ప్రజాస్వామ్యంలో విలువువలుండాలని, ప్రచార సమయంలో తనపై అసభ్య పదజాలంతో, దూషణలతో మాట్లాడారని, ఇది మంచి పద్ధతి కాదని రాయచోటి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాయచోటి నియోజక వర్గంలో ఓటింగ్‌లో పాల్గొన్న ఓటరు మహాశ యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ప్రజా తీర్పు అన్నది అంతిమమన్నారు. ఈ ఎన్నికల్లో అపోహలు సృష్టించి, భయ భ్రాంతులకు గురిచేయాలన్న వారి దుశ్చర్యలను ప్రజలు తిప్పిగొట్టారన్నారు. తనపై నియోజక వర్గ ప్రజలకు నమ్మకం ఉందన్నారు. తాను అమెరికాలో ఉద్యోగం చేశానని, ఇంగ్లీష్ భాషపై ఎంతో పట్టు తనకు ఉందన్నారు. ఎన్నికలలో పోటీ చేసే వారు, ప్రజా సేవ చేయాలనుకున్న ఆలోచనలున్న వారు విజ్ఞతతో ఆలోచించి మాట్లాడాలని, ప్రవర్తన, భవిష్యత్ తరాలు అనుసరించే విధంగా ఉండాలని పేర్కొన్నారు. మందీ మార్బలంతో కాన్వాయ్ వాహనాలతో వెళుతూ, ఫోన్ చేసి ప్రతి ఒక్కరినీ బెదిరించడం, దూషించడం, అవతల పార్టీ వ్యక్తులపై దౌర్జన్యాలు చేయించడం ఇది ప్రజాస్వామ్యంలో చాలా తప్పు అని అన్నారు. వారు ఎన్నికల నియమావళిని పూర్తిగా ఉల్లంఘించారన్నారు. రాయచోటి నియోజక వర్గంలో ఎన్నికల సమయంలో పోలీసు వ్యవస్థ దీన్ని ఎందుకు అరికట్టలేక పోయిందో ఆశ్చర్యంగా ఉందన్నారు. రాయచోటి మండలం లోని నక్కావాండ్లపల్లె, లక్కిరెడ్డిపల్లె మండలంలోని చౌటపల్లె తదితర ప్రాంతాలలో బూత్ లలోకి వెళ్లి ఘర్షణలకు దిగడం, అలాగే కొన్ని బూత్ లలోకి వెళ్లి మహిళలపైన అసభ్య పదజాలాన్ని వాడటం చాలా దురదృష్టకరమన్నారు. ఫేక్ వీడియోలు సృష్టించిన వారిని క్రైమ్ పోలీసులు చేదిస్తున్నారని, తప్పు చేసిన వారిని వదలమని పేర్కొన్నారు. వైసిపి గెలుపు కోసం అనునిత్యం, ఆఖరి నిమిషం వరకు కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి సామర్థ్యం ఆధారంగా విద్యాబోధన

- పిఎఎల్ శిక్షణలో ఆర్‌జెడి రాఘవరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థి సామర్థ్యం ఆధారంగా విద్యార్థులకు వైయుక్తిక భేదాలు అనుగుణంగా విద్యాభ్యాసం చేయాలని పిఎఎల్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లర్నింగ్) ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రాంతీయ సంచాల కులు జోన్-4 రాఘవరెడ్డి, డిఇఒ అనురాధ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయనగర్ కాలనీలో సమగ్ర శిక్ష ఎపిఒ రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు జిల్లాల లోని పిఎఎల్ పాఠ శాలల ప్రధానోపాధ్యాయులు, ఇంగ్లీషు, గణిత ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయస్థాయిలో నోబుల్ అవార్డు గ్రహీత రాబర్ట్ మైకేల్ క్రేమర్ ఆధ్వర్యంలో రూపకల్పన చేసిన కాన్వి జీనియస్ కంటెంట్ డెవ లప్మెంట్ ప్రోగ్రాం ద్వారా ప్రపంచంలోని 120 దేశాలు అమలు పరుస్తున్న పిఎఎల్ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని 564 పాఠశాలల్లో 2019 నుంచి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పిఎఎల్ కార్యక్రమం ద్వారా 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు వారి వైయుక్తిక భేదాలకను గుణంగా విద్యాభ్యాసం నిర్వహించి ప్రతి విద్యార్థి ఆ తరగతికి గల సామ ర్థ్యాన్ని అందే విధంగా బోధన అభ్యసనం చేయాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులు చేయవలసిన విధి విధా నాలు కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు జిల్లాల డిఎన్ఒ అశోక్ రెడ్డి, దస్తగిరి రెడ్డి, జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

కాటన్ దొర చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

కాటన్ దొరకు ఘన నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

సర్ ఆర్థర్ కాటన్ దొర అపర భగీరథడు, నదుల అనుసంధానానికి ఆద్యుడని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం కాటన్ దొర 221వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కాటన్ దొర ఆంగ్లేయుడు అయినప్పటికీ సమాజ సేవ పరమవధిగా భారతీ యుల, ప్రత్యేకించి ఆంధ్రుల హృదయాల్లో నిలిచిపోయారని ప్రశంసించారు. 1842-1852 మధ్య కాలంలో గోదావరి నది మీద ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి సస్యశ్యామలం చేసినట్లు చెప్పారు. కృష్ణా నదిపై విజయవాడ వద్ద, కావేరి నదిపై ఆనకట్టల నిర్మాణం కాటన్‌దొర కృషేనని తెలిపారు. కాటన్ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వాలు సాగునీటి రంగానికి ఎంతో ప్రాము ఖ్యతనిచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, బీగాల రామకృష్ణ, ఉత్తన్న, అమర్, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, వినయ్, శివ పాల్గొన్నారు.

అరటి రైతులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గాలుల వల్ల నష్టపోయిన అరటి రైతులకు అండగా ఉంటామని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లి గ్రామపరిధిలో గాలులకు పడిపోయిన అరటి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం నుంచి పరిహారం అందేల చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి ఉన్నారు.

నేలకొరిగిన అరటి పంటను పరిశీలిస్తున్న మనోహర్‌రెడ్డి

సమాజ భాగస్వామ్యంతో డెంగీని నివారిద్దాం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

జాతీయ డెంగీ దినోత్సవం ప్రతి సంవత్సరం మే 16న నిర్వహించుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎన్.కొండయ్య, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవ సాగర్, జిల్లా మలేరియా అధికారి బి. వేణుగోపాల్ తెలిపారు. బుధవారం జిల్లా కార్యాలయంలో డెంగీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లా డుతూ ఈ సంవత్సరం 'సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధి నివారిద్దాం' అనే నినాదంతో ప్రజలకు అవగాహనా కల్పిస్తున్నామని చెప్పారు. డెంగీ వ్యాధి ఇడిస్ దోమ, టైగర్ అడదోమ ద్వారా వ్యాపిస్తుందని ప్రతి వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో డెంగీ నివారణ, చికిత్స గురించి పూర్తి అవగాహనా ప్రజలకు కల్పిస్తున్నారని చెప్పారు. విపరీతమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, కంటి నొప్పి, వికారం, వాంతులు, శరీరంపై ఎర్రటి దదర్లు, అలసట, ముక్కుల నుండి రక్తస్రవం శ్వాస తీసుకోవడం కష్టం, రక్త కణాలు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని పేర్కొన్నారు. అన్ని ప్రాథమిక, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ఎస్ఎస్-1 డెంగీ కిట్స్ ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చు. జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణ కొరకు నీరు నిలువ ఉన్న ప్రాంతం లో దోమ లార్వ, పెరగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డెంగీ నిర్ధారణ అయితే వెంటనే ఆగ్రామల్లో దోమల నివారణకు పైరేత్రియం, స్ప్రేయింగ్, ఫాగింగ్ చేపడుతున్నామని చెప్పారు. ప్రజల కుడా ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. దోమతెరలు వాడాలని, వైద్య సిబ్బంది ప్రతి రోజు గ్రామాల్లో దోమల నివారణకు ప్రజలకు అవగాహనా కల్పించాలని చెప్పారు. డ్రైడే ఫ్రైడే ద్వారా ప్రతి శుక్రవారమూ దోమల పెరుగుకుండా ప్రజలకు అవగాహనా కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య అధికారి డాక్టర్ శైలజ, జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ , మలేరియా సబ్ యూనిట్ అధికారులు వై. ప్రసాద్ యాదవ్, జె జయరామయ్య, సిహెచ్ఒలు నారాయణ, రామకృష్ణ, కె. బలరామరాజు, సరళ, శివారెడ్డి పెంచలయ్య, ఈశ్వరయ్య, జిల్లా వైద్య సిబ్బంది పాలుగోన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్‌తో వైసిపి నాయకులు

గెలుపు ధీమాలో వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మదనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్‌ను ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లె వైసిపి నాయకులు ఖాదర్‌బాషా, నారాయణ, ఆదెన్న, మహమ్మద్‌వల్లి, శంకర బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని అన్నారు. ఓటర్లు జగనన్న పరిపాలనకు పట్టం కట్టారని వివరించారు. మదనపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా నిస్సార్‌అహ్మద్, రాజంపేట పార్లమెంటు ఎంపీగా పివి.మిథున్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. సిఎం జగన్ అన్ని వర్గాల ప్రజలకు వారి అభివృద్ధి కోరి సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. వృద్ధులకు నేరుగా ప్రతి నెల ఒకటవ తేదీనే వాలంటీర్ ద్వారా పింఛన్‌ను ఇంటి వద్ద అందించారని వివరించారు. ప్రజలు తమ మద్దతును వైసిపికి అందించారని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి దుష్ట శక్తులతో పోరాడారని తెలిపారు. జూన్ 4న తర్వాత వైసిపి పరిపాలన మళ్లీ కొనసాగుతుందని ఆశాభవం వ్యక్తం చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మాట్లాడుతున్న సలీంబాషా

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎపి బిల్డింగ్ కన్‌స్ట్రక్చన్స్ వర్కర్ యూనియన్ జిల్లా సెక్రెటరీ ఎస్.సలీంబాషా డిమాండ్ చేశారు. బుధవారం పిటిఎం రోడ్డులో కార్పెంటర్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సలీంబాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అయినా అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డును ప్రారం భించాలని, భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమం బోర్డులో పెండింగ్‌లో ఉన్న 35 లక్షల క్లైములను వెంటనే విడుదల చేసే విధంగా పనిచేయాలని అన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభు త్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బాలకృష్ణ, కుమార్, గఫూర్, తంబయ్య పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి జ్యోతి మహోత్సవం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలం దేవగుడిపల్లి గ్రామం కొండమూలలో చౌడేశ్వరిమాత జ్యోతి మహోత్సవం ఘనంగా ముగిసిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారిని పుష్ప పల్లకిలో సింహ వాహనంపై మంగళవారం రాత్రి జ్యోతుల తోఊరేగించి బుధవారం ఉదయం భక్తాదులకు అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమము నిర్వహించారు. ఈ ఉత్సవానికి తొగటవీర క్షత్రియులు, మదనపల్లి, కర్ణాటక నుంచి భారీ ఎత్తున తరలివచ్చారు.

టిడిపిని ఆదరించిన అందరికీ ధన్యవాదాలు :'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి:

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని ఆదరించి ఓటువేసిన అందరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలపై సరళిపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి, అక్రమాలపై ప్రజల్లో వ్యతిరేక వచ్చిందని అన్నారు. నియోజకవర్గంలో వైసిపి చేసిన అభివృద్ధి ఏమి చేయలేదని, టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు చేరువయ్యాయని అన్నారు. అభివృద్ధి, నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు ప్రధాన అంశంగా టిడిపి ప్రచారంలో దూసుకెళ్లడం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సహకారం, మోడీ అనుభవం, మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి వర్గం సైతం టిడిపికి సహకరించడం విజయానికి సంకేతమని అన్నారు. జూన్ 4 తర్వాత రాష్ట్రంలో ప్రజా పాలన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అర్హులైన పేద, బడుగు, బలహీన వర్గాలకు అందేలా కృషి చేస్తానని చెప్పారు. టిడిపిని ఆదరించి వారందరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రకృతిలో దొరికే పండ్లతో ఆరోగ్యం

బంకీరు చెట్టు, పండ్లలో పలు ఔషధ గుణాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆరోగ్యాన్నిచ్చే బంకీర్ పండ్లు

ప్రకృతి మనకు వివిధ రకాల ఔషధ గుణాలు కలిగిన పండ్లను కూడా ప్రసాదించింది. అలాంటి పండ్ల చెట్లల్లో బంకీరు చెట్టు కూడా ఒకటి. దీన్నె విరిగి కాయల చెట్టు, నక్కెర పండ్ల చెట్టు, బంక నక్కెర చెట్టు, యంక కాయల చెట్టు అని కూడా పిలుస్తారు. ఈ చెట్లు మనకు ఎక్కువగా గ్రామాల్లో, రోడ్ల పక్కన కనిపిస్తాయి. చాలామంది ఈ నక్కెర పండ్లను ఎంతో ఇష్టంగా తింటారు. పండిన కాయలు మరింత రుచిగా ఉంటాయి. ఈ కాయలు లోపల బంకలాగా తియ్యగా ఉంటాయి. కొందరు ఈ నక్కెర కాయలతో పచ్చడి చేసుకుంటారు. దీన్నే ఇంగ్లిష్‌లో ఇండియన్ చెర్రీని అని, హిందీలో లసొరా, లసోడా అని పిలుస్తారు. ఈ కాయలు గుత్తుగుత్తులుగా కాస్తాయి. ఈ పండ్లు, చెట్టు ప్రతి భాగం కూడా ఔషధ గుణాలను, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ బయోటిక్ గుణాలను కలిగి ఉంటాయి. ఈ బంకీరు పండ్లు మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో కూడా లభిస్తాయి. వీటిల్లో మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. క్యాల్షియం, జింక్, ఐరన్, ప్రోటీన్స్, కాపర్, జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. ఈ పండ్లను తినడం వల్ల శరీరానికి మేలు కలుగుతుంది. చలువ చేస్తుంది. రక్తదోషాలు పోతాయి. లైంగిక సామర్థ్యం మెరుగుపడుతుంది. పురుషులు ఈ పండ్లను తీసుకోవడం వల్ల వారిలో వీర్య కణాల సంఖ్య పెరుగుతుంది. ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగిస్తున్నారు. బంకీరు పండ్లను తినడం వల్ల జీర్ణ సామర్థ్యం పెరుగుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి సమస్యలతో బాధపడే వారు ఈ పండ్లను తినడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. మన ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ ఈ పండ్లను చాలా తక్కువగా తీసుకోవాలి. రోజూ పది పండ్ల కంటే ఎక్కువగా తీసుకోకూడదు. విరిగి చెట్టు ఆకులకు తలనొప్పిని తగ్గించే గుణం ఉంది. ఈ చెట్టు లేత ఆకులను పేస్ట్‌గా చేసి నుదుటిపై రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయానికి తలనొప్పి తగ్గుతుంది. ఈ చెట్టు బెరడును పేస్ట్‌గా చేసి చర్మ సమస్యలు ఉన్న చోట లేపనంగా రాసుకుంటే తగ్గిపోతాయి. ఈ చెట్టు బెరడును నీటిలో వేసి మరిగించాలి. తర్వాత ఈ నీటిని వడకట్టగా వచ్చిన కషాయాన్ని నోట్లో పోసుకుని పుక్కిలించాలి. ఇలా చేయడం వల్ల దంతాలు, చిగుర్లు ధృఢంగా, ఆరోగ్యంగా మారతాయి. నోటి దుర్వాసన తగ్గుతుంది. నోటి పూత కూడా తగ్గుతుంది. నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ బెరడు కషాయంతో గాయాలను కడగడం వల్ల త్వరగా మానుతాయి. ఈ విధంగా బంకీరు పండ్లు, చెట్టు మనకు ఎంతగానో మేలు చేస్తాయని, వీటిని ఉపయోగించడం వల్ల మంచి ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

మారని వాహనదారుల తీరు

- బస్టాండ్‌ను బైక్‌స్టాండ్ మార్చిన వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-గాలివీడు

బస్టాండ్ ఆవరణంలో పార్కింగ్ చేసిన బైక్‌లు

పట్టణంలోని స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆటోలకు, బైక్‌లకు స్టాండ్‌గా మారిపోయింది. ఆర్‌టిసి బస్సులు నిలిపేందుకు స్థలం లేకుండా బైక్‌లు పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం, గురువారాలలో కూరగాయలసంత, గొర్ల సంత కావడంతో బస్టాండ్ అంతా ద్విచక్ర వాహనాలతో నిండిపోతుంది. గాలివీడు బస్టాండ్‌కు రాయచోటి, కడప, చిత్తూరు, పులివెందుల, వేంపల్లి తదితర ప్రాంతాల నుంచి ఆర్‌టిసి సర్వీసులు నడుస్తాయి. బస్టాండ్ వచ్చే ఆర్‌టిసి బస్సులు ఎక్కడా నిలపాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. బస్టాండ్ ప్రాంతంలో వాహనాలను, ఆటోలను పార్కింగ్ చేయకూడదని ఎన్నిమార్లు సూచించినా వారు తీరు మార్చుకోక పోవడం బాధకరమని స్థానికులు వాపోతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు బస్టాండ్‌లో నిలబడేందుకు కూడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రయాణీలకు అవస్థలపై దృష్టి సారించాలని అన్నారు. బస్టాండ్‌లో కంట్రోలర్ లేకపోవడం ద్వారా వ్యవస్థ తారుమారవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్ టిసి అధికారులు స్పందించి బస్టాండ్‌లో కంట్రోలర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మరుగుదొడ్లను పునరుద్ధరించండి

నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌కు వెనుకవైపు కూరగాయల సంతలో నాబార్డు నిధులతో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. పైప్‌లైన్ చెడిపోవడంతో మరమ్మతులకు నోచక పోవడం వల్ల నిరుపయోగంగా మారాయి. కూరగాయలను కొనేందుకు ఎక్కువ మంది మహిళలే వస్తుంటారని ఇక్కడ మరుగుదొడ్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సుదూర ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నా వినియోగించుకునే పరిస్థితిలో లేవని అన్నారు. పైప్‌లైన్లు మట్టితో పూడుక పోయాయని మరమ్మతులు చేసేవారే కరువారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పైప్‌లైన్‌ను పునరుద్దరించి మరుగుదొడ్లను వినియోగంలోకి తెస్తే మహిళకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని చెబుతున్నారు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని పైప్‌లైన్ ఏర్పాటు చేసి మరుగుదొడ్లను పునరుద్ధరించాల్సిందిగా మహిళలు కోరుతున్నారు.

జాతర విజయవంతానికి సహకారం అందించాలి

ప్రజాశక్తి-గాలివీడు

జాతర నిర్వహణపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

స్థానిక పక్కిరరెడ్డిగారిపల్లిలో గాలిటమ్మ తిరుణాలను ప్రశాంతంగా వైభవంగా జరపడానికి గ్రామస్తులతో పాటు ప్రజలందరూ సహకారం అందించాలని వైస్ ఎంపిపి మిట్టపల్లి యధుభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గాలిటమ్మ గుడిలో జాతర పైన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు, స్థానికులు అందరూ కలిసి జాతర నిర్వహణపై చర్చించుకున్నారు. 20న గాలిటమ్మను దేవాలయం నుంచి తీసుకోవడం, 21న వీరబల్లి వాస్తవ్యులచే గాలిటమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ, ఊరేగింపు ఉంటుందని తెలిపారు. 22, 26వ తేదీల్లో సోలెం గ్రామంలోని అన్ని గ్రామాలో గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. 27వ తేదీ రాత్రి చాందిని బండ్లు, బాణ సంచాలతో ఘనంగా జరపడానికి ప్రజలందరూ సహకారం అందించాలని కోరారు. ఐక్యంగా ఘనంగా జరుపుదామని పెద్ద లందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో మిట్టపల్లి .గోపీకృష్ణారెడ్డి, హేమ కుమార్‌రెడ్డి, లోకయ్య, వార్డు మెంబర్ గాలివీటి శ్రీనివాసులు, సూరిబాబు, మహేంద్ర, గొర్ల ముధువేటి, శ్రీనివాసులు, సాయినాథ్ రెడ్డి, రమేష్, శేఖర్ పలువురు పక్కిరారెడ్డిగారిపల్లి వాస్తవ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతి కార్యాలయము, పీలేరు

రె.క నెం. 04/2024 తేది: 15-05-2024

బహిరంగ వేలము ప్రకటన

పీలేరు గ్రామ పంచాయతికి సంబంధించిన షాపింగ్ గదులు తేది: 18-05-2024 నుండి 31-03-2025 వరకు నెలసరి బాడుగ పద్ధతిపై గుత్త హక్కును కేటాయించుటకు తేది: 18-05-2024 శనివారము మధ్యాహ్నం 02:30 గంటలకు పీలేరు గ్రామ పంచాయతి కార్యాలయము నందు పంచాయతీ కార్యదర్శి గాని లేక వారి అనుమతి ఉత్తర్వులు పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

వ. నెం.	గది గల ప్రదేశము	గది నెం.	కట్టవలసిన డిపాజిట్టు	హాజరు పరచవలసిన సాల్వెన్సీ ధృవపత్రము
1	వారపు సంత రోడ్డు	1 నుండి 6 వరకు	50000/-	100000/-
		7 నుండి 8 వరకు	200000/-	300000/-
		09 నుండి 14వరకు	50000/-	100000/-
2	దినసరి కూరగాయల మార్కెట్	17 నుండి 19వరకు	15000/-	100000/-
3	వారపు సంత రోడ్డు	20	10000/-	100000/-
4	వారపు సంత రోడ్డు	21నుండి 23వరకు	25000/-	100000/-
5	వారపు సంత రోడ్డు	24నుండి 27వరకు	15000/-	100000/-
6	దినసరి కూరగాయల మార్కెట్	29	10000/-	100000/-
7	వారపు సంత రోడ్డు	30	10000/-	100000/-
8	దినసరి కూరగాయల మార్కెట్	31	10000/-	100000/-

గమనిక : గది నెం.6 మరియు 30వ గదులు నాయి బ్రాహ్మనులకు, గది నెం.3,14,20,27 గదులు యస్.సి./యస్.టి.ల వర్గముల వారికి రిజర్వు చేయబడినది.

షరతులు :

1. వేలములో పాల్గొను వారు పంచాయతికి పన్నులు, లీజు/ బాడుగ మొత్తములు బకాయిలు ఉండరాదు.
2. బహిరంగ వేలము అయిన వెంటనే మొదటి మరియు రెండవ పాట దారుల డిపాజిట్టును మినహాయించు కొని తక్కిన డిపాజిట్లు వాపసు చేయబడును.
3. షె.కు/ షె.తె/వె.త తరగతుల వారు కుల ధృవీకరణ పత్రములతో హాజరు కావలెను.
4. వేలమును నెలసరి బాడుగ మాత్రమే పాట పాడవలెను.
5. ప్రభుత్వ నిషేదిత వ్యాపారములు సదరు రూములలో నిర్వహించుట నిషేదించబడినది.
6. ప్రతి నెల బాడుగను జి.యస్.టి.తో కలిపి చెల్లించవలెయును.
7. ప్రతి నెల 10వ తేది లోపల నెల బాడుగ చెల్లించని యెడల 18% పీనల్ వడ్డీతో కలిపి వసూలు చేయబడును.
8. ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును.
9. వేలము రద్దు పరుచుటకు మరొక తేదికి వాయిదా వేయుటకు పంచాయతి కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు.
10. 6 నెలల బాడుగను ముందుగానే చెల్లించవలెను.

గమనిక: 1. డిపాజిట్టును పంచాయతి సెక్రటరి, గ్రామ పంచాయతి పీలేరు వారి పేరున డి.డి. ద్వారా మాత్రమే స్వీకరించబడును, నగదు మరియు బ్యాంకర్ చెక్ స్వీకరింపబడవు.
2. వేలపు పాట మొత్తము పై 2% స్టాంపుడ్యూటీ తప్పనిసరిగా చెల్లించవలెయును.

శ్రీ. యస్.ఎ.గఫూర్
పంచాయతి కార్యదర్శి (పూ.అ.భా)
గ్రామ పంచాయతి, పీలేరు

శ్రీమతి షేక్. జీనత్ షఫి
సర్పంచ్,
గ్రామ పంచాయతి, పీలేరు

పీలేరు గ్రామ పంచాయతి వేలపు నోటిఫికేషన్

రె.క నెం. 03/2024 తేది: 15-05-2024

బహిరంగ వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పీలేరు గ్రామ పంచాయతికి చెందిన 1) వారపు సంత 2) దినసరి కూరగాయల మార్కెట్టు 3) ప్రైవేటు బస్టాండు 4) జంతు వధశాల 2024-25 సంవత్సరమునకు అనగా 18-05-2024 నుండి 31-03-2025 వరకు రుసుము వసూలు చేసుకొనుటకు హక్కును తేది: 18-05-2024న శనివారము ఉదయం 11.00 గంటలకు పీలేరు గ్రామ పంచాయతి కార్యాలయము ఆవరణములో పంచాయతి కార్యదర్శి వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము వేయబడును. వేలము నందు పాల్గొనదలచిన వారు ఈ క్రింది తెలిపిన వివరముల మేరకు ధరావత్తు మరియు సాల్వెన్సీ హాజరు పరచి వేలము నందు పాల్గొనవలెను.

వ. సంఖ్య	వనరుల వివరములు	చెల్లించవలసిన డిపాజిట్టు	సాల్వెన్సీ ధృవ పత్రము	సాల్వెన్సీ లేనివారు చెల్లించవలసిన డిపాజిట్టు
1	2	3	4	5
1	వారపు సంత	10,00,000-00	7,00,000-00	10,00,000-00
2	దినసరి మార్కెటు (మంగళవారము మినహాయించి)	2,00,000-00	1,00,000-00	2,00,000-00
3	ప్రైవేటు బస్టాండు	2,00,000-00	1,00,000-00	2,00,000-00
4	జంతు వధశాల, మాంసపు అంగళ్లు	1,50,000-00	50,000-00	1,00,000-00

షరతులు :

1. వేలము నందు పాల్గొనదలచిన వారు గ్రామ పంచాయతికి ఎలాంటి బాకీలు ఉండరాదు.
2. వేలము ధరావత్తు చెల్లించని వారు వేలములో పాల్గొనుటకు అనర్హులు.
3. 2023-24 సంవత్సరమునకు వేలపు నోటిఫికేషన్ ప్రకారము పాటించవలసిన సూచనల మేరకు హెచ్చుపాటగా నిలిచిన గుత్తదారుడు, హెచ్చు పాట పూర్తి మొత్తమును (07) ఏడు రోజుల లోపల చెల్లించవలయును. అట్లు చెల్లించని యెడల చెల్లించిన ధరావత్తు మొత్తము గ్రామ పంచాయతీకి దండుగ క్రింద జమ చేసుకొని రెండవసారి పాటదారునికి అదే నిబంధనలతో ఖాయపరచబడును లేక మరు వేలము వేయబడును.
4. సాల్వెన్సీ ధృవపత్రము లేని వారు చెల్లించవలసిన డిపాజిట్టుకు రెట్టింపు ధరావత్తును చెల్లించి వేలము నందు పాల్గొనవచ్చును.
5. వేలము పంచాయతి కార్యదర్శి గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని నిర్వహించబడును.
6. వేలము రద్దు పరచుటకు గాని లేక వాయిదా వేయుటకు గాని వేలము వేయు అధికారికి పూర్తి అధికారము కలదు.
7. మిగతా వివరములు కార్యాలయపు పనివేళల యందు తెలుసుకొనవచ్చును.

గమనిక: 1. డిపాజిట్టును పంచాయతి సెక్రటరి, గ్రామ పంచాయతి పీలేరు వారి పేరున డి.డి. ద్వారా మాత్రమే స్వీకరించబడును, నగదు మరియు బ్యాంకర్ చెక్ స్వీకరింపబడవు.
2. వేలపు పాట మొత్తము పై 2% స్టాంపుడ్యూటీ తప్పనిసరిగా చెల్లించవలయును.

శ్రీ. యస్.ఎ.గఫూర్
పంచాయతి కార్యదర్శి (పూ.అ.భా)
గ్రామ పంచాయతి, పీలేరు

శ్రీమతి షేక్. జీనత్ షఫి
సర్పంచ్,
గ్రామ పంచాయతి, పీలేరు

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎఎస్‌ఐ బొజ్జనాయక్

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన సందర్భంగా రాజకీయ పార్టీల పేరుతో ఆ పార్టీ గెలుస్తుందని,ఈ పార్టీ గెలుస్తుందని అనవసరంగా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ సూర్యనారాయణ హెచ్చరించారు. ఈసందర్భంగా నగర పంచాయతి దేగానిపల్లిలో సిఐ అదేశాల మేరకు ఎఎస్‌ఐ బొజ్జనాయక్ బుధవారం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఏమైనా అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరిగాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల తరపున గొడవలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం తెలపాలని కోరారు. రాజకీయ నాయకుల కోసం ప్రజల మధ్య వైషమ్యాలు వద్దని హితవు పలికారు.



ఉపాధి కూలీలతో కలిసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న ద్వారకనాథ్‌రెడ్డి

ఉపాధి కూలీలకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

ఎన్నికల పోలింగ్ సరళిని బట్టి రానున్నది కూటమి ప్రభుత్వమేని, చంద్రబాబు ముఖ్య అవుతారని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామంలో ఉపాధి కూలీలతో కలసి మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి తన 63వ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. ఉపాధి కూలీలతో కలసి కేక్ కట్ చేసి నిడంబరంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలతో కలసి తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. జూన్ 4 తరువాత పేదప్రజల ప్రభుత్వం వస్తుందని, పేద ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. ఉపాధి కూలీలకు అండగా ఉండి ప్రభుత్వం నుంచి రావాల్సిన లబ్ధిని చేకూరుస్తామని తెలిపారు.

1 నుంచి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-గాలివీడు



జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినబాలుర ఉన్నత పాఠశాల

2024-25 విద్యా సంవత్సరం నుంచి బాలుర ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా ఉన్నతీకరించారని, జూన్ 1నుంచి ఇంటర్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్ పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి స్థానిక బాలుడు ఉన్నత పాఠశాల ఆవరణంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడానికి కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల ఇంగ్లీష్ మీడియంను ప్రారంభం అవుతుందని తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపిసి 40 సీట్లు, సిఇసి 40 సీట్లు కలవని ఆ పాఠశాల పేర్కొన్నారు. చుట్టుపక్క ఉన్నత పాఠశాలలో విద్యా భ్యాసం చేసిన పదో తరగతి విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు అందరు ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే కరపత్రాల ద్వారా మండలంలో చుట్టూ ప్రచారం నిర్వహించామని విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చంద్రబాబు శకం ముగిసింది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈ ఎన్నికలతో చంద్రబాబు శకం ముగిసిందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. కుప్పంలో చంద్ర బాబు, మంగళగిరిలో లోకేష్, హిందూపురంలో బాల కృష్ణకు ఓటమి తధ్యంమని తెలిపారు. వైసిపి నాయకడు పోరెడ్డి నరసింహారెడ్డి ఇంటిలో బుధ వారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో రాష్ట్రవ్యాప్తంగా 120 నుండి 135 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి గెలువబోతోందని అన్నారు. తనకున్న ఖచ్చితమైన సమాచారం మేరకు ఈ ప్రకటన చేస్తున్నానన్నారు. పేద లబ్ధిదారులకు సంక్షేమ పథకాలైన చేయూత, ఆసరా, ఇన్‌పుట్ సబ్సిడీ పథకాల నగదు నేడోరేపో వారి ఖాతాల్లో చేరబోతోందన్నారు. జగన్ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రాబోతోందన్నారు. ఇక అధికారిక ప్రకటన మాత్రమే మిగిలిందని రాచమల్లు తెలిపారు. జూన్10 నుండి జగన్ వైజాగ్ నుండి పాలన అందించబోతున్నారన్నారు.

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా..!

ప్రజాశక్తి - ఖాజీపేట

సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ప్రభుత్వ అధికారులు యధావిధిగా తమ విధుల పట్ల శ్రద్ధ వహించాల్సి ఉంది. ఎన్నికల సీజన్ కావడంతో ప్రభుత్వ అధికారులందరూ ప్రజా సమస్యలపై దృష్టి సారించలేకపోయారు. గత నాలుగు నెలలుగా ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికలు ముగియడంతో ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారం వైపు అడుగులు వేయాలని పలువురు సూచిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ సమస్యలు అధికంగా వేధిస్తున్నాయని గ్రామీణులు వాపోతున్నారు. విద్యుత్ తీగలు కిందికి వేలాడడం, స్తంభాలు నేలకొరగడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని ప్రజలు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలో కడప ప్రధాన రహదారిపై ఓ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. తీగెలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ స్తంభాన్ని మార్పు చేసి ప్రమా దాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు పలుమార్లు అధి.కారులను కోరారు. అయినా వారిలో స్పందనలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తుండడంతో గాలుల ఎక్కువగా వీచే అవ కాశం ఉందని, ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆ ప్రాంత ప్రజలు భయాం దోళలను వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైసిపి పోలింగ్ ఏజెంట్‌పై దాడి

మండలంలోని విశ్వనా థపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు భూమిరెడ్డి చంద్ర ఓబుల్‌రెడ్డిపై బుధవారం టిడిపి నాయకులు దాడికి పాల్పడ్డారు. మైదుకూరు పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. సోమవారం జరిగిన పోలింగ్‌లో చంద్రఓబుల్‌రెడ్డి వైసిపి తరపున ఏజెంట్‌గా కూర్చు న్నాడనే కారణంతో అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కార్తీక్‌రెడ్డి, బొచ్చు సుబ్బారెడ్డి, ఇల్లూరి సుబ్బారెడ్డి బుధవారం సాయంత్రం మైదు కూరులోని ప్రొద్దుటూరు రోడ్డులో ఘర్షణకు దిగారు. ఈ సంఘటనలో బీరు సీసాలు తీసుకొని తలపై కొట్టడంతో చంద్రఓబుల్‌రెడ్డి తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడ్ని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పరామర్శించి, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మైదుకూరు డిఎస్‌పి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బాధితుడ్ని విచారించారు. చంద్రఓబుల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.